మద్దతు ధర పొందండి

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆయా ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉండదానికే ప్రభుత్వం ప్రతి గ్రామంలోను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర క్వింటాల్‌కు ఏ1 గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 పొందాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500లు బోనస్ ఇస్తోందని, అలాగే దొడ్డు రకం ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర చెల్లించి రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తారని చెప్పారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.


బెజ్జంకి(సిద్దిపేట): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ


కోహెడ(హుస్నాబాద్): కోహెడలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం కర్ణాకర్


హుస్నాబాద్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత


మద్దూరు(హుస్నాబాద్): ప్రారంభిస్తున్న చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి


హుస్నాబాద్‌రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి


మర్కూక్(గజ్వేల్): ఎర్రవల్లిలో..


కొమురవెల్లి(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ


జగదేవ్‌పూర్(గజ్వేల్): చాట్లపల్లిలో..

కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


మిరుదొడ్డి(దుబ్బాక): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట(దుబ్బాక)/దుబ్బాక టౌన్/దౌల్తాబాద్(దుబ్బాక)/దుబ్బాకరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ధర్మారం, తొగుట వ్యవసాయ మార్కె ట్ యార్డు, రాయపోల్ మండల కేంద్రంలోను, అలాగే దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపూర్, దుబ్బాక రూరల్‌లోని అప్పనపల్లి గ్రామంలోను సోమవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరను పొందాలన్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాను ప్రారంభించకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటామని ప్రకటించడం దుర్మార్గమని వాపోయారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూ టీ తహసీల్దార్ వీరేశ్, జిల్లా సివిల్ సప్లయి అధికారి రాజిరెడ్డి, ఏపీఎం డాకయ్య, ఎంపీఓ జహీరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సూకూరి లింగం, అంజిరెడ్డి, బాల్‌రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, బాగులు, దుర్గారెడ్డి, యాదాకృష్ణ, మైసయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఏఎంసీ కార్యదర్శి స్వామి, డీపీఎం రాజయ్య, ఏపీడీ మధుసూదన్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు స్వామి, రమేశ్, రాంరెడ్డి, డీపీఎం రాజయ్య, డీఆర్డీఏ ఏపీడీ మధుసూదన్, తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో బాలయ్య, ఏపీఎం కిషన్, ఏవో నరేశ్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ భాను ప్రకాశ్, కిష్టయ్య, రాజేశ్వర్‌రావు, శివకుమార్, ఏఈవో రజిత పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన వాహనాల రద్దీ

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- కౌంటర్‌లు పెంచాలంటూ సూచనలు


టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ శివారులోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం సాయంత్రం కూడా వాహనాల రద్దీ కొనసాగింది. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో సొంత ఊర్లకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండడంతో టోల్ ప్లాజా వద్ద రద్దీ పెరిగింది. సుమారు రెండు వందల మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరుస పండుగల నేపథ్యంలో టోల్ ప్లాజాలోని కౌంటర్ల సంఖ్యను తాత్కాలికంగా పెంచినప్పటికీ రద్దీని అరికట్టలేకపోయారు. దీంతో ఒక్కొక్క వాహనం టోల్ దాటేందుకు గంట సమయం పట్టిందని వాహనదారులు వాపోయారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా కౌంటర్లను పెంచేలా చూడాలని కోరారు.

పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకర వాతావరణం

విజయదుర్గా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు


పారిశుద్ధ్య కార్మికులతో హరినాథశర్మ

కొండపాక(గజ్వేల్): సక్రమమైన పారిశుద్ధ్య నిర్వహణతోనే ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంటుందని విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెప్పెల హరినాథశర్మ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శరన్నవ రాత్రోత్సవాల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను సోమవారం సన్మానించి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రం ఆవరణలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా కార్మికులు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, ట్రస్టు సభ్యులు నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్, రాజేంద్రప్రసాద్, బాలరాజు, సురేశ్, విఠల్, మల్లేశం పాల్గొన్నారు.

అ‘పూర్వ’సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శుభోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సిద్దిపేటలో సోమవారం నిర్వహించారు. పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ స్నేహితులను కలుసుకుని ఆనాటి రోజులను గుర్తుచేసుకున్నారు. చదువుల్లో రాణిస్తున్న పేద విద్యార్థులకు బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నారు. వారికి విద్య బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఎజాస్ అహ్మద్, శ్రీనివాస్‌శర్మ, బాపురెడ్డి, చరణ్, దుర్గయ్య, మౌళి, పద్మయ్య పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రూ.21,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మహంకాళి.. కరుణించు తల్లి


పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

గజ్వేల్‌రూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మహంకాళి అమ్మవారి మూలవిరాట్‌కు సోమవారం వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నంద బాలశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టాభిషేకం చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌రావు, పద్మశాలి సంఘం యువజన నాయకులు ప్రేమ్‌కుమార్, మల్లేశం, నాగరాజు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

- జక్కాపూర్‌లో పీస్ కమిటీ సమావేశం
- పాల్గొన్న ఏసీపీ మధు


మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటరూరల్: జాతి, మతం, కులం, వర్గం లాంటి బేధాలు లేకుండా ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఏసీపీ మధు పిలుపునిచ్చారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామంలోని కులపెద్దలు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులతో సోమవారం ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న ఘటనలు జరిగినప్పుడు అందరూ కలసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. చెప్పుడు మాటలువిని ఐక్యమత్యాన్ని చెడగొట్టుకోవద్దని, వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూర్ ఎస్‌ఐ బాలకృష్ణ, రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ కులసంఘాల పెద్దలు పాల్గొన్నారు.

మల్లన్నకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్నను పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సోమవారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులు పాల్గొన్నారు.

పాలకులు మారినా.. మారని బతుకులు

సీపీఎం జిల్లా నేత శశిధర్


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శశిధర్

కొమురవెల్లి(సిద్దిపేట): దేశంలో పాలకులెందరు మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్ల బండి శశిధర్ అన్నారు. దాసరి బాలస్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన లెనిన్‌నగర్ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టజీవులకు ఏకష్టం వచ్చినా అండగా నిలిచేది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ.. శక్తి స్వరూపిణి

దసరాతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండపాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను ఆదివారం రాత్రి నుంచి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఊరేగింపులో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు కోలాటాలు ఆడి సందడి చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.


దుబ్బాక: నిమజ్జనం ఊరేగింపులో యువకులు

వ్యక్తి అదృశ్యం


యాదగిరి(ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం యాదగిరి మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవలు పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగివచ్చి భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడు తిరిగి రాకపోవడంతో యాదగిరి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి సిటీ పోలీసు యాక్టు: సీపీ


సీపీకి మొక్కను అందజేస్తున్న వాసుదేవరావు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో మంగళవారం నుంచి సిటీ పోలీసు యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి 30వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని, ఈ సమయంలో ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదని చెప్పారు. డీజేల వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా పొడిగిస్తున్నట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వాసుదేవరావు సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న ఆనంద్

సిద్దిపేటకమాన్: వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది సమయ పాలన పాటించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ హెచ్చరించారు. ఇందిరమ్మ కాలనీ బస్తీ దవఖాన, పాత ఎంసీహెచ్ కేంద్రంలో కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. సెంటర్‌లో నెలవారీగా వైద్య సేవలు పొందుతున్న ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మర్యాదపూర్వక కలయిక


ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న కమలాకర్

మద్దూరు(హుస్నాబాద్): జనగామ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షుడు శివరాజ్ యాదవ్‌ను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం జనగామలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో లింగపూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, జాలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, సాగర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, భాను, సచిన్ యాదవ్, దూళ్మిట్ట, మద్దూరు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న శ్రీరాములు

మిరుదొడ్డి(దుబ్బాక): మాలల హక్కుల సాధనకై 25న తలపెట్టిన మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి హైదరాబాద్ రవీంద్రభారతి వరకు సాగే ఈ పాదయాత్రకు వేలాదిగా తరలివచ్చి భాగం కావాలన్నారు. కార్యక్రమంలో ధారస్వామి, యాదగిరి, సుమన్, రాజు, రమేశ్, కనకయ్య, లక్ష్మణ్, పరశురాములు, చిన్నరాజు, రాజేందర్, కిషోర్, శ్రీనివాస్, యాదగిరి, రాగరాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ముట్టడిస్తాం


మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే ఫీజు రియింబర్స్‌మెంట్స్, ఇతర నిధులను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్, పట్టణ కోఆర్డినేటర్ రమేశ్ హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13లక్షల విద్యార్థుల కోసం బీఆర్ఎస్వీ పోరాటం చేస్తోందన్నారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాదగిరి, శ్యామ్, రాజు, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



కొండపాక(గజ్వేల్): పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ దోహదపడుతోందని పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వెలికట్టలో ఎర్రబోయిన నర్సింహులు, కెమ్మసారం జ్యోతికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం అందజేశారు. లింగారావు, తిరుపతి, సిద్దులు పాల్గొన్నారు.

◆ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా కులవృత్తిదారులకు అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ పిలుపునిచ్చారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం సోమవారం సిద్దిపేటలో ప్రారంభమైంది.

◆ ఆలయంలో చోరీకి యత్నం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలోని దుర్గమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆలయ ద్వారానికి ఉన్న తాళాన్ని పగులగొట్టేందుకు ఇద్దరు ప్రయత్నించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఇప్పటికి రెండు సార్లు ఇలాంటి ప్రయత్నాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ నిరుద్యోగ యువత మేల్కొనాలి

సిద్దిపేటజోన్: నిరుద్యోగులు, యువత మేల్కొనాలని తెలంగాణ నిరుద్యోగ ఫోరం, తెలంగాణ వీవర్స్ ఫోరం మాజీ చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కొంతమంది తమ స్వలాభం కోసం 10శాతం రిజర్వేషన్లు సాధించుకొనేలా బిల్లును ఆమోదించి పార్లమెంట్‌కు పంపించారని ఆరోపించారు. సమావేశంలో శ్రీనివాస్, శేషు తదితరులు పాల్గొన్నారు.

◆ పోస్టర్ ఆవిష్కరణ



వర్గల్(గజ్వేల్): బెజ్జంకి మండల కేంద్రంలో 27న జరగనున్న స్వేరోస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కిష్టనోల్ల స్వామి పిలుపునిచ్చారు. వర్గల్‌లో సోమవారం ఆ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజు, సురేశ్, పరశురాములు, స్వామి పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా సునీల్, ఉపాధ్యక్షుడుగా ప్రభాకర్, రాజు, సహాయ కార్యదర్శులుగా రత్నాకర్, అరుణ్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్టు తెలిపారు.

◆ ఇందిరమ్మ కమిటీలు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలకంగా పనిచేయనున్నాయని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు అన్నారు. నార్సింగిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అర్హులను గుర్తించి, పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఈ ఇందిరమ్మ కమిటీలను నియామకం చేస్తోందన్నారు.

◆ ఆర్యవైశ్య సంఘం అలయ్‌బలయ్

నర్సాపూర్: దసరా పండుగను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, గౌరవ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌గుప్తా, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ 16న బైక్‌ల వేలం

నర్సాపూర్: పలు కేసుల్లో పట్టుబడిన మూడు బైకులను 16న వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పద్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. గంజాయి రవాణా, అబ్కారీ కేసుల్లో మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వాటిని ఉన్నతాధికారుల సూచనల మేరకు 16న వేలం వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు తమ కార్యాలయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

◆ మీసేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజుపల్లిలో మీసేవ కేంద్రాన్ని నడుపుతున్న మన్నె రాజు భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు రావెల్లి గ్రామానికి చెందిన కానుకుంట గణేశ్ ఫిర్యాదు చేశాడు.